క్లుప్తంగా

నిరుద్యోగులకు శిక్షణ

మార్కాపురం టౌన్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పీఎంకేవీవై 4.0లో భాగంగా పదో తరగతి, ఐటీఐ, ఇంటర్మీడియెట్, డిగ్రీ చదివిన నిరుద్యోగ యువకుల కోసం మార్కాపురం పట్టణంలోని ఎస్‌వీసీ ట్రెనింగ్ సెంటరులో అసిస్టెంటు ఎలక్ట్రీషియన్, ప్లంబరు శిక్షణ ఇస్తామని స్కిల్ డెవలప్‌మెంటు ఆఫీసరు జె.రవితేజ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు నెలల పాటు శిక్షణ ఇచ్చి స్థానికంగా ఉన్న పరిశ్రమల్లో లేదా ఇతర జిల్లాలో ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. వివరాలకు 70139 50097, 73960 89890 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఉపకారవేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

బేస్తవారిపేట: అర్హత కలిగిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ విద్యార్థులు నూతన ఉపకార వేతనాలకు, రెన్యువల్స్ ఈనెల 30వ తేదీలోపు చేసుకోవాలని సహాయ సాంఘిక సంక్షేమశాఖ అధికారి ఇ. రాజేశ్వరమ్మ తెలిపారు. డిగ్రీ, పీజీ, టెక్నికల్ కోర్సులు చదువుతున్న విద్యార్థులకు ఉపకారవేతనాల కోసం జ్ఞాన భూమి పోర్టల్‌లో కళాశాలల ప్రిన్సిపాల్స్ రిజిస్ట్రేషన్ చేయాలని కోరారు. 2024–25కు సంబంధించి రెన్యువల్స్, కొత్తగా దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు గ్రామ సచివాలయ పరిధి, మండల సంక్షేమ, విద్యా సహాయకుల లాగిన్‌లో ఫైవ్ స్టెప్ వెరిఫికేషన్ చేయించుకోవాలని సూచించారు.

30లోపు దరఖాస్తు చేసుకోవాలి

మార్కాపురం టౌన్: మార్కాపురం పరిధిలో అర్హత కలిగిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ విద్యార్థులు ఉపకార వేతనాలు, రెన్యూవల్స్ కోసం ఈ నెల 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఏఎస్‌డబ్ల్యూఓ అరుణకుమారి గురువారం తెలిపారు. డిగ్రీ నుంచి పీజీ వరకు అన్ని కోర్సుల విద్యార్థులు టెన్నికల్, నాన్ టెన్నికల్ విద్యను అభ్యసిస్తున్న వారు మెట్రిక్ అనంతరం ఉపకారవేతనాలు పొందగోరువారు 2024–25 సంవత్సరానికి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మార్కాపురం పరిధిలోని అన్ని కళాశాలల యాజమాన్యాలు, విద్యార్థులు లాగిన్ నందు రెన్యువల్స్, నూతన ఉపకార వేతనాల కోసం జ్ఞానభూమి లాగిన్‌లో రిజిస్ట్రేషన్ చే సుకోవాలని కోరారు.

చట్టం ద్వారా పరిష్కారం

కంభం: ఈ నెల 23వ తేదీన ఉదయం 10 గంటలకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గిద్దలూరు ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ. ఓంకార్ అధ్యక్షతన 'విధాన్ సే సమాధాన్' చట్టం ద్వారా పరిష్కారం అనే అంశంపై సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వీరభద్రాచారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో రీసోర్స్ పర్సన్స్‌గా సీనియర్ న్యాయవాదులు మొఘల్ హజరాంబి, కె. సత్య సులోచన హాజరవుతారని మండల పరిధిలోని మహిళలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

24న కార్తీక వనభోజనాలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

కంభం: యోగి వేమన రెడ్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 24వ తేదీ ఆదివారం నాగులవరం వద్ద కార్తీక వనభోజన మహోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు జొన్నకూటి రామిరెడ్డి తెలిపారు. గురువారం రాత్రి సంఘం కార్యాలయంలో వనభోజన మహోత్సవ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కంభం, అర్ధవీడు మండలాల రెడ్డి సంఘీయులంతా తప్పక హాజరు కావాలని కోరారు.

24న సగర భగీరథ సేవా సంఘ వనభోజనాలు

గిద్దలూరు రూరల్: మండలంలోని ముండ్లపాడు రోడ్డులో గల భగీరథ ఆలయ ప్రాంగణంలో సగర భగీరథ సేవా సంఘం వారి వన భోజనాలను ఆదివారం ఘనంగా నిర్వహించనున్నట్లు సంఘం నాయకుడు మజ్జారి రాముడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్తీక మాసంలో నిర్వహించబోయే వనభోజనాలకు సగర సంఘానికి చెందిన ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యులతో కలిసి వన భోజన మహోత్సవంలో పాల్గొనాల్సిందిగా కోరారు.

జగనన్న కాలనీ సందర్శన



జగనన్న కాలనీలో మాట్లాడుతున్న ఎంపీడీఓ మస్తాన్‌వలి

కొమరోలు: మండలంలోని దద్దవాడ గ్రామంలో జగనన్న కాలనీని గురువారం స్థానిక ఎంపీడీఓ మస్తాన్‌వలి సందర్శించారు. ఈసందర్భంగా అసంపూర్తిగా నిర్మించి ఉన్న గృహ లబ్ధిదారులతో ఎంపీడీఓ మాట్లాడారు. త్వరితగతిన గృహాలను పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు తెలిపారు. గృహాలు నిర్మించుకోవడానికి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న లబ్ధిదారులకు పొదుపు పథకంలో లోనన్లు మంజూరు చేస్తామని తెలిపారు. అనంతరం నల్లగుంట్ల గ్రామంలోని గ్రామ సచివాలయాన్ని ఎంపీడీఓ మస్తాన్‌వలి సందర్శించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ జి.క్రిష్టారెడ్డి పాల్గొన్నారు.

జగనన్న కాలనీలపై చిన్నచూపు

- మౌలిక వసతులు కల్పించడం పై దృష్టి చూపని అధికారులు
- చిల్ల చెట్లతో నిండిపోయిన కాలనీలు
- వృథాగా పోతున్న బోరునీరు
- 24 గంటలపాటు వెలుగుతున్న వీధి లైట్లు
- వసతులు కల్పిస్తే నిర్మాణాలు పూర్తి చేసుకుంటామంటున్న లబ్ధిదారులు



కంభంలో పాలిటెక్నికల్ కళాశాల వెనుక లే అవుట్‌లో నిర్మాణాలు పూర్తి చేసుకున్న గృహాలు

కంభం: పేదలందరికీ పక్కా ఇళ్లు ఉండాలన్న లక్ష్యంగా జగనన్న కాలనీల్లో అర్హులైన లబ్ధిదారులకు గత ప్రభుత్వం ఇంటి పట్టాలు అందించి ఇల్లు కట్టుకునే వెసులు బాటు కల్పించింది. కానీ ప్రస్తుతం పరిస్థితి తలకిందులైంది. నేడు పలువురు ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకొని అందులో నివాసం ఉంటుండగా.. మరికొందరి గృహాల నిర్మాణాలు వివిధ దశలో ఉన్నాయి. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జగనన్న కాలనీలపై పర్యవేక్షణ కొరవడటంతో నిర్మాణాలు చేసుకునే వారితో పాటు అక్కడ నివాసం ఉండే వారు అవస్థలు పడుతున్నారు. మండలంలో 15 లేఅవుట్లలో సుమారు 1000 మందికి పైగా ఇంటి పట్టాలు ఇవ్వడంతో పాటు వారికి రిజిస్ట్రేషన్‌లు చేసి ఇచ్చారు. అందులో 475 మంది లబ్ధిదారులకు హౌసింగ్‌లో మంజూరు కాగా 162 గృహాల నిర్మాణాలు పూర్తయ్యాయి. 229 గృహాలు బేస్‌మెంట్ స్థాయిలో ఉండగా, 39 గృహాలు రూఫ్ లెవల్‌లో ఉన్నాయి. మిగిలిన గృహాలు వివిధ దశల్లో ఉన్నాయి. గృహ నిర్మాణాలు పూర్తి చేసుకోవాలనుకునే వారికి మౌలిక వసతులు కరువడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇంటి నిర్మాణాలు త్వరగా పూర్తి చేసుకోమని వెంటపడే అధికారులు అక్కడ మౌలిక వసతులు మెరుగుపరిచేలా చర్యలు తీసుకోవడం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు.

వసతులు లేక ఇక్కట్లు

మండలంలో ప్రధానంగా కంభం పాలిటెక్నికల్ కళాశాల, కందులాపురం రోడ్డు, చిన్నకంభంలో ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ఆనుకొని జగనన్న లే అవుట్లు వేయడం జరిగింది. ఈ మూడు కాలనీల్లో సుమారు 700 మందికి ఇంటి పట్టాలు ఇవ్వగా హౌసింగ్‌లో మంజూరైన వాళ్ళలో పలువురు గృహాలు నిర్మించుకున్నారు. మిగిలిన వారి గృహాలు వివిధ దశల్లో ఉన్నాయి. పాలిటెక్నికల్ కళాశాల, తర్లుపాడు రోడ్డులో ఉన్న కాలనీల్లో మౌలిక వసతులు లేక లబ్ధిదారులు అవస్థలు పడుతున్నారు. సీసీ రోడ్లు లేక పోవడంతో అంతర్గత రోడ్లు అధ్వానంగా మారిపోయాయి. ఇంటి నిర్మాణాలు చేసుకునే వారి కోసం ఇసుక, కంకర, ఇటుకలు తోలుకునేందుకు లారీలు, ట్రాక్టర్లు వస్తుంటాయి. అవి తిరుగుతుండటంతో రోడ్లన్నీ గుంతలమయంగా మారిపోతున్నాయి. కాలనీలో గృహాల మధ్య చిల్లచెట్లు నిండి పోయి అడవులను తలపిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. కొన్ని చోట్ల వీధి లైట్లు ఇబ్బంది పడుతుంటే ఉన్న చోట 24 గంటలు లైట్లు వెలుగుతూ కరెంటు వృథా అవుతోంది. మంచినీళ్ళ పైపు లైన్లు లీకేజీలు ఉండటంతో నీరంతరం వృథాగా వెళ్లిపోతోంది. తర్లుపాడు రోడ్డులో ఉన్న కాలనీలో బోరు నీళ్ళు ఎక్కువగా వృథా అవుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.

అభివృద్ధి అవసరం

కాలనీల్లో పెరిగిపోయిన చిల్లచెట్లను తొలగించి, విద్యుత్ సరఫరాను మెరుగు పరచాలి. పైపు లైన్ల లీకేజీ అరికట్టి నీరు వృథా కాకుండా చర్యలు తీసుకోవాలి. సిమెంటు రోడ్లు నిర్మించి, డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను, బోరు బాక్సులను శుభ్ర పరచి రక్షణ కల్పించాలి. వీధి లైట్లు రాత్రి పూట మాత్రమే వెలిగేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

మందుబాబులకు అడ్డాగా..

హైవే రోడ్డుకు సమీపంలో కాలనీలు ఉండటంతో రాత్రి పూట మందు బాబులు మద్యం తాగేందుకు కాలనీల్లో నిర్మాణంలో ఉన్న గృహాలను షెల్టర్లుగా చేసుకుంటున్నారు. మద్యం సేవించి గాజు సీసాలు అక్కడే పగలగొట్టి పడేస్తుండటంతో కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. మందుబాబులకు, అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారక ముందే అధికారులు చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

పాము కరిచింది



జగనన్న కాలనీలోనే ఇల్లు కట్టుకొని నివాసం ఉంటున్నా. రాత్రి పూట బయటకు రావాలంటే భయమేస్తోంది. గత నెలలో ఇంట్లోకి పాము వచ్చి నన్ను కరించింది. ఎన్ని సార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్ళినా సమస్య పరిష్కారం కావడం లేదు.

– తమ్మిశెట్టి సత్యమూర్తి, కందులాపురం

కంప చెట్లు తొలగించాలి



జగనన్న కాలనీలో ఇల్లు కట్టుకుంటున్నా. కాలనీలో అంతా చిల్ల చెట్లు పెరిగిపోయాయి. వర్షం పడితో కాలనీలోకి నడవలేని పరిస్థితి ఏర్పడుతోంది. చిల్ల చెట్లు తొలగించి, రోడ్లు వేస్తే ఇళ్ళు కట్టుకున్నాక ఇక్కడే నివాసం ఉండటానికి అనువుగా ఉంటుంది.

– యం. కిశోర్



అధ్వానంగా ఉన్న అంతర్గత రోడ్డు



జగనన్న కాలనీలోని బోరు నుంచి వృథాగా పొతున్న నీరు



తర్లుపాడు రోడ్డులో ఉన్న జగనన్న కాలనీలో పెరిగిన చిల్లచెట్లు



పగటి పూట వెలుగుతున్న వీధి లైట్లు



గృహాల మధ్య పెరిగిన చిల్లచెట్లు

సంయుక్త కిసాన్ మోర్చ మహాధర్నా జయప్రదం చేయండి



మాట్లాడుతున్న రంగారావు

మార్కాపురం: ఒంగోలు కలెక్టరేట్ వద్ద ఈ నెల 26న జరిగే సంయుక్త కిసాన్ మోర్చ మహాధర్నాను జయప్రదం చేయాలని ఏపీ రైతు, వ్యవసాయ కార్మిక, గిరిజన, వృత్తి, సామాజిక సంఘాల సమన్వయ సమితి కన్వీనర్ చుండూరి రంగారావు పిలుపునిచ్చారు. ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి దుగ్గెంపూడి తిరుపతిరెడ్డి, మార్కాపురం నియోజకవర్గ రైతు సంఘ ప్రధాన కార్యదర్శి పీవీ కొండయ్య అధ్యక్షతన గురువారం స్థానిక పూలసుబ్బయ్య భవన్‌లో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ పేద ప్రజలు పన్నులు కడుతుంటే కార్పొరేట్ కంపెనీలకు బ్యాంకులు భారీగా రుణాలు దోచిపెడుతున్నాయని విమర్శించారు. నష్టాల్లో ఉన్న రైతులకు రుణమాఫీ చేయలేని ప్రభుత్వాలు మరో వైపు బహుళజాతి కంపెనీలకు లక్షల కోట్ల రూపాయలను రుణమాఫీ చేస్తోందని తీవ్రంగా విమర్శించారు. పాలకవర్గాలు తప్పుడు విధానాలను ఎత్తిచూపేందుకే మహాధర్నా చేపడుతున్నామన్నారు. ఏపీ రైతు సంఘ ప్రధాన కార్యదర్శులు కె.వీరారెడ్డి, పమిడి వెంకటరావులు మాట్లాడుతూ రైతులు కార్మికులు, వ్యవసాయ కూలీలు, ప్రజా సంఘాల నాయకులు పెద్దఎత్తున పాల్గొని ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. ఢిల్లీలో సుమారు ఏడాదిపాటు నిర్వహించిన రైతు ఉద్యమంతో నరేంద్రమోదీ ప్రభుత్వం మూడు చట్టాలను ఉపసంహరించుకుందని పేర్కొన్నారు. వెలుగొండ ప్రాజెక్టు పూర్తి చేయుటలో పాలకవర్గం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఐ మార్కాపురం నియోజకవర్గ కార్యదర్శి అందె నాసరయ్య, వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు గుమ్మ బాలనాగయ్య, జిల్లా రైతు కూలీ సంఘ ఉపాధ్యక్షుడు కొండారెడ్డి వెంకటేశ్వరరెడ్డి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్‌కే ఖాశీం, నాయకులు సీహెచ్ వీరయ్య, కాశయ్య పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు బానిసలు కావద్దు



విద్యార్థులతో మాట్లాడుతున్న కంభం సీఐ

కంభం: విద్యార్థులు చెడు వ్యసనాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోకుండా పట్టుదలతో చదువుకొని ఉన్నతశిఖరాలకు చేరాలని కంభం సీఐ మల్లిఖార్జున అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం సాయంత్రం సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ మహిళలు, విద్యార్థినిలను వేధించడం, ర్యాగింగ్‌కు పాల్పడటం వంటివి చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఆన్‌లైన్ మోసాలు అధికంగా జరుగుతున్నాయని అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి ఓటీపీ, బ్యాంకులకు సంబంధించిన ఇతర వివరాలు అడిగితే చెప్పకుండా జాగ్రత్త వహించాలన్నారు. బాల్యవివాహాలకు పాల్పడకూడదని చదువుకోవాల్సిన వయస్సులో ఆడపిల్లలను చదివించాలన్నారు. నేటి సమాజంలో పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని తెలిపారు. యువకులు గంజాయి, డ్రగ్స్ వంటి వాటికి బానిసలు కాకూడదని సూచించారు. ఎస్సై బి. నరసింహారావు పాల్గొన్నారు.

ఆంధ్రవిలాస్ హోటల్ ఆకస్మిక తనిఖీ



హోటల్ పరిశీలిస్తున్న కమిషనర్

గిద్దలూరు రూరల్: పట్టణంలోని ఆంధ్ర విలాస్ హోటల్‌ను స్థానిక కమిషనర్ డి.వెంకటదాసు గురువారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఆంధ్రవిలాస్ హోటల్‌లో భోజనం చేసిన ఓ వ్యక్తి ఆహార సరఫరాపై ఫిర్యాదు చేయడంతో కమిషనర్ హోటల్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిబంధనలకు విరుద్ధంగా హోటల్ నిర్వహించవద్దని హెచ్చరించారు. హోటల్ వంటశాల గదితో పాటు పాత్రలను పరిశీలించారు. శుభ్రత పరిశుభ్రత పాటించాలని సూచించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు తలెత్తకుండా చూసుకోవాలని సూచించారు. సిబ్బంది వివరాలను అడిగితెలుసుకున్నారు. ఆహార నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆర్ఐ టపాసు వలి, సిబ్బంది ఉన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



వృద్ధులకు దుప్పట్లు అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

మార్కాపురం: చలికాలం కావడంతో చలికి తాళలేక ఇబ్బంది పడుతున్న వృద్ధులకు, యాచకులకు, అనాథలు సుమారు 100 మందికి కావాల్సినట్లు దుప్పట్లను ఆదియోగి ఫౌండేషన్ ఆధ్వర్యంలో చైర్మన్ బొంతల కృష్ణ, సామాజిక కార్యకర్త మొగిలి మల్లికార్జునరావు రెండు రోజులుగా పట్టణంలో రాత్రిపూట అందిస్తున్నారు. మార్కాపురం రైల్వే స్టేషన్ వద్ద ఉన్న నిరాశ్రయులకు, వృద్ధులకు, నడవలేని వారికి సైతం రైల్వే పోలీసుల సాయంతో దుప్పట్లు అందజేశారు. పట్టణంలోని పాత బస్టాండు, చెన్నకేశవస్వామి గుడి, అయ్యప్పస్వామి గుడి, రీడింగ్ రూమ్ సెంటరులో ఉన్న వృద్ధులకు దుప్పట్లను అందించారు. బీజేపీ మహిళా పట్టణ అధ్యక్షురాలు మిరియాల వాసుప్రియ, బీజేపీ నాయకులు గోనుగుంట్ల శ్రీధర్, హనుమాన్ మెన్స్‌వేర్ రామకృష్ణ, అరిటెడ్ సెరికల్చర్ సిబ్బంది గురుమూర్తి, మున్సిపల్ వాటర్ సప్లయి వర్కర్ కనకయ్య, పలువురు సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

బెల్ట్‌షాపుపై దాడి చేసిన ఎక్సైజ్ అధికారులు

పొదిలి రూరల్:

పొదిలి మండలం ఆముదాలపల్లిలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బెల్ట్‌షాపుపై గురువారం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు దాడి చేసి పట్టుకున్నట్లు సీఐ అరుణకుమారి తెలిపారు. దాడిలో బెల్ట్ షాపు నిర్వహిస్తున్న గ్రామానికి చెందిన నల్లబోలు శ్రీనివాసులు అనే వ్యక్తిని పట్టుకుని కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. 16 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన



మాట్లాడుతున్న ఎస్సై బ్రహ్మనాయుడు

తర్లుపాడు: సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాలు, మహిళల భద్రత, ట్రాఫిక్ అంశాలపై స్థానిక జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు ఎస్ఐ బ్రహ్మనాయుడు గురువారం అవగాహన కల్పించారు. ఆధునిక టెక్నాలజీని ఉపయోగించుకుని బ్యాంకింగ్, సోషల్ మీడియాలో సైబర్ నేరగాళ్లు విజృంభిస్తున్నారని, వారిని అరికట్టేందుకు వ్యవహరించాల్సిన విధానాలు వివరించారు. 1930 నంబరుకు ఫోన్ చేసి సంబంధిత ఫిర్యాదులు చేయవచ్చని చెప్పారు. ఫోక్సో చట్టం, బాలల ప్రవర్తన, అపరిచిత కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. హెచ్ఎం సుధాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు ధైర్య సాహసాలతో ఉండాలి

తాళ్లూరు: విద్యార్థులు ధైర్య సాహసాలు కలిగి ఉండాలని ఎస్సై మల్లికార్జునరావు సూచించారు. స్థానిక కేజీబీవీ పాఠశాలలో సైబర్ క్రైమ్, ఉమెన్ క్రైమ్, రోడ్డు ప్రమాదాలపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మల్లికార్జునరావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి శారీరక, మానసిక ధృడత్వం కలిగి ఉండాలని సూచించారు. క్రీడల్లో రాణిస్తే శరీర పటుత్వం పెరుగుతుందన్నారు. క్రమశిక్షణతో కూడిన విద్యను అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రుద్రసముద్రంలో వైద్య సేవలు



వైద్య సేవలు అందిస్తున్న సిబ్బంది



పారిశుధ్యం పనులు చేస్తున్న కార్మికులు

సాక్షి ఎఫెక్ట్..

దొనకొండ: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎం.సునీత పర్యవేక్షణలో వైద్య సిబ్బంది గురువారం రుద్రసముద్రంలో వైద్య సేవలు అందించారు. మంచం పట్టిన రుద్రసముద్రం అనే వార్తకు స్పందించిన వైద్య సిబ్బంది గ్రామానికి చేరుకుని ఇంటింటికీ తిరిగి సర్వే చేపట్టి వైద్య పరీక్షలు చేశారు. జ్వర పీడితులను గుర్తించి వారికి రక్త పరీక్షలు, సెలైన్ ఎక్కించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. అవసరమైతే వైద్య సేవలు గ్రామంలో కొనసాగిస్తామని, వైద్య సిబ్బంది నిత్యం గ్రామంలో ఉండే విధంగా చూస్తామని వైద్యాధికారి సునీత తెలిపారు. పంచాయతీ సిబ్బంది గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. బోరింగుల వద్ద మురుగు తొలగించారు. బ్లీచింగ్, ఫినాయిల్ చల్లారు. వీధుల వెంట ఫాగింగ్ చేశారు.

మేతబీడు ఆక్రమణపై తహసీల్దార్‌కు ఫిర్యాదు



తహసీల్దార్‌కు అర్జీ ఇస్తున్న గ్రామస్తులు

తర్లుపాడు: మండలంలోని కారుమానిపల్లిలో సర్వే నంబర్ 72లో ఉన్న 121 ఎకరాల మేతబీడు భూమిని కాపాడాలంటూ తహసీల్దార్ విజయభాస్కర్‌కు గ్రామస్తులు గురువారం ఫిర్యాదు చేశారు. తర తరాలుగా సదరు భూమిలో మేకలు, గేదెలు మేపుకుంటున్నట్లు తెలిపారు. మూగజీవాలకు మరెక్కడా గ్రామంలో భూమిలేదని, అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని వారు అర్జీ అందించారు. గ్రామస్తులు వెంగళరెడ్డి, డి.వెంకటేశ్వరరెడ్డి, గాయం శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

కొనుగోలుదారులకు బిల్లు తప్పనిసరి

పెద్దారవీడు: ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేసిన రైతులకు బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలని మార్కాపురం సహాయ వ్యవసాయ సంచాలకులు బాలాజీనాయక్ అన్నారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఎరువుల దుకాణాల యజమానులతో గురువారం సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ రైతులు కొనుగోలు చేసిన వాటికి బిల్లు కచ్చితంగా ఇవ్వాలని, అలా ఇవ్వని పక్షంలో షాపుల యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వం ద్వారా గుర్తింపు పొందిన ఎరువులు, పురుగుల మందుల మాత్రమే అమ్మాలని, ఎలాంటి అనుమతి లేని వాటిని విక్రయించరాదని చెప్పారు. గ్రామాల్లో ఎవరైనా లైసెన్స్ లేకుండా ఎరువులు, రసాయన మందులు, బయో పురుగు మందులు విక్రయించినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకొని వారి షాపు లైసెన్స్‌ను రద్దు చేస్తామని హెచ్చరించారు.

సోలార్ విద్యుత్‌పై అవగాహన



ఏఈ మాట్లాడుతున్న శ్రీనివాసరావు

దొనకొండ: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సోలార్ విద్యుత్‌పై అవగాహన గురువారం కల్పించారు. సోలార్ విద్యుత్ వినియోగంపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించి విద్యార్థులు ప్రజలను చైతన్య పరచాలని విద్యుత్ శాఖ దర్శి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఈ.శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పీఎం ఘర్ సోలార్ ప్రాజెక్టులో భాగంగా సోలార్ ఏర్పాటు చేసేందుకు తక్కువ ఖర్చు అవటమే కాకుండా కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ అందిస్తోందన్నారు. బ్యాంకుల నుంచి రుణాలు పొందవచ్చని, సోలార్ ద్వారా కిలో వాట్స్‌కు కేంద్ర ప్రభుత్వం రూ.30 వేల సబ్సిడీ ఇస్తుందని, రెండు కిలో వాట్స్‌కు రూ.60 వేల సబ్సిడీ ఇస్తుందన్నారు. సోలార్ విద్యుత్‌ను గ్రామాల్లోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశ పెట్టిందన్నారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులకు, గ్రామస్తులకు సోలార్‌పై అవగాహన కల్పించి ప్రతి ఒక్కరూ సోలార్ వినియోగించుకునేలా చైతన్య పరచాలని కోరారు. సోలార్ ప్రాజెక్టుతో తక్కువ ఖర్చుతో నాణ్యమైన విద్యుత్ పొందవచ్చని, దీంతో ఎలాంటి ఇబ్బందులు ఉండవని, గ్రామాల్లోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని శ్రీనివాసరావు సూచించారు. ఏఈ నాగూర్‌వలి, విద్యుత్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.